
# శలవా...శలవ్

'హిమబిందు'



ఆ రోజే భారతీదేవి ఇంటికి వస్తున్నది. ఆ ఇంట్లో సభ్యు లందరి కళ్ళల్లో ఆత్రత, ఆరాటం. ప్రతిక్షణం ఎదురుచూపు.

"అమ్మా! పదకొండు గంటల తరువాత అమ్మమ్మ వస్తుం దన్నావ్ మరి..."

గోడ గడియారంవైపు చూసింది సువర్చల. పన్నెండు అయింది.

"నాకు క్రికెట్ మాచ్ ఉందనీ చెప్పినా బలవంతంగా లాక్కొచ్చావ్. ఈ ఊళ్ళో ఉండే వాళ్ళమేకదా! రేపు చూడగూడదా?"

కొడుకును కోపంగా కసరబోయి ఆగిపోయింది. అన్నలు, వదినలు, వాళ్ళ పిల్లలు, చెల్లెలు, చెల్లెలు భర్త, పిల్లలు - హాల్లో తలా ఒకవైపు కూర్చుని ఉన్నారు.

"ఒంటిగంట దాకా చూస్తాను. రాకుంటే నేను వెళ్ళిపోతాను." గోడకు చెబుతున్నట్లు చెప్పి వెళ్ళిపోయాడు బాలు.

"అమ్మలూ... పిల్లల్ని సక్రమమైన మార్గంలో నడిపించు. ఈ నడకే రేపటి భవిష్యత్తుకు పునాది. పరుగులు పెట్టించి పడివేయగలదు. జాగ్రత్తగా నడిపించి కోరుకున్న స్థానంలో నిలబెట్టగలదు."

"మం...చి...ది..." వెటకారం... తల్లి చెప్పిన జాగ్రత్తలకు తన నిర్లక్ష్యపు సమాధానం.

"మరీ ఇంత ఆలస్యం చేశా రేమిటి?" విసుగు మిళితమైన స్వరంతో అన్నాడు మాధవ్.

"అదే నాకూ అర్థం గావటంలేదు." చిరాకు నిండిన గొంతుతో అన్నవైపు తిరిగాడు ఈశ్వర్.

"డాడీ! నానమ్మ ఎప్పుడు వచ్చేది?" అయిదేళ్ళ నానీకి ఎవరూ సమాధానం చెప్పలేదు.

"బావగారూ! మీరు అలా కాసేపు పడుకోకూడదూ...?" చెల్లెలి భర్తగా, ఆ ఇంటి అల్లుడిగా ఎంతో గొప్ప స్థానం ఇస్తున్నట్లుగా పైపై

మర్యాదవ మాటలు.

"పర్వాలేదు..." అతనికి తెలును వీళ్ళ మనస్తత్వాలు... అందుకే అంటీ ముట్టనట్టుగా పరాయి వ్యక్తిగా ఉంటాడు. ఇప్పుడైనా వచ్చింది అత్తగారికోసం. అంతే... వీరితో తన కేమిటి?

"వంటలన్నీ చల్లారిపోతున్నాయి." పెద్దకోడలు రమణి గొణుగుడు.

"ఈయనకు ఈ మధ్యదాకా బాగాలేదు. ఇంత తిని టాబ్లెట్స్ వేసుకుంటేనే ఈయన కాస్త మనిషి." చిన్న కోడలు శారద సణుగుడు.

మరో మూడు గంటలు గడిచాయి. అన్నట్లుగా బాలు ఒంటిగంటకు వెళ్ళిపోయాడు. వాళ్ళు వచ్చేసరికి ఎంత ఆలస్యం అవుతుందో భోజనాలు కానిద్దాం అని మాధవ్ పురమాయిస్తే అంత భోజనాలు కానిచ్చారు.

"డాడీ! నానమ్మ వచ్చేసరికి సాయంత్రం అవుతుందేమో. నేనూ, డాలీ మ్యాట్నీకి వెళ్ళమా?"

"మీరు వెళ్ళగానే నానమ్మ వస్తే... పిక్చర్ వద్దు, ఏమీ వద్దు. సరదాగా ఛెస్ అన్నా షటిల్ అన్నా ఆడుకుందాం."

పిల్లలు కూడబలుక్కుని ఆటల్లో మునిగిపోయారు. ఉదయంపూట ఉన్న ఆత్రత, ఆదుర్దా ఏ ఒక్కరిలో లేవు. కూర్చున్న స్థానాల్లోనే పడకసీను వేశారు. కాసేపటికి నిద్రపోయారు కూడా.

ఇం టల్లుడు ముకుందరావు కుర్చీలో కునికిపాట్లు పడుతుంటే సువర్చల గుమ్మంలో దిగాలుగా కూర్చుని వీధిలోకే చూస్తోంది.

సూర్యుడు అస్తమిస్తున్న వేళ. అందర్నీ ఒకేసారి తట్టి లేపుతున్నట్లు హారన్ మోగించుకుంటూ ఇంటి ముందుకు వచ్చి ఆగింది నల్లటి టాక్సీ. బిలబిల మంటూ టాక్సీ చుట్టూ మూగారు సభ్యులంతా.

భారతీదేవి దిగింది టాక్సీనుండి - డాక్టర్ కోదండపాణి డోర్ తెరిచి పట్టుకోగా.

"అమ్మా... అమ్మా... అత్తయ్యా... నానమ్మా... అమ్మమ్మా!! అపేక్షలు... ఏడ్పులు... కౌగిలింతలు - అన్నీ వీధిలోనే అయిపోయాయి.

"లోపలికి పదం డమ్మా!" డాక్టర్ కోదండపాణి, పరమేశం ఇద్దరూ ఒకేసారి అన్నారు. అంతా అడ్డు తొలిగారు.

భార్య భుజాల చుట్టూ చేయి వేసి మెల్లగా నడిపించుకుని లోపలికి తీసుకువచ్చాడు పరమేశం.

గదిలోకి తీసుకుపోబోతున్న భర్తతో అంది భారతీదేవి లోగొంతుకతో - "కాసేపు ఈ కుర్చీలో కూర్చుంటా" అని.

"అలాగే" అంటూ కూర్చోబెట్టాడు పరమేశం. "మళ్ళీ కలుస్తా" అని వెళ్ళిపోయాడు కోదండపాణి.

పేరు పేరునా అందర్నీ పిలిచింది. ఆప్యాయత కురిపించింది. అలాగే వాళ్ళు తన ఆరోగ్యం గురించి కన్నీళ్ళు పెట్టుకుంటుంటే... ఆపేక్ష చూపిస్తుంటే తట్టుకోలేనట్లు ఉక్కిరిబిక్కిరి అయింది కాసేపు.

సువర్చల, సుమతి ఇంకా ఏడుస్తూనే ఉన్నారు తల్లిని చూస్తూ తరచి తరచి. రమణి, శారద వదినల హోదాలో ఓదారుస్తున్నారు.

"కాసేపు మీరు విశ్రాంతి తీసుకోవటం మంచిది" మన్ననగా ముకుందరావు అనేసరికి పరమేశం ఉలిక్కిపడి కన్నీళ్ళు తుడుచుకుని భార్య దగ్గరికి వచ్చాడు.

"కాసేపు పడుకుందువు పద. ప్రయాణంలో బాగా అలసిపోయావ్" అంటూ గదిలోకి తీసుకెళ్ళాడు.

కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లనిపించింది భారతీదేవికి. మూడు నెలలుగా హాస్పిటల్లో నరకంలో ఉన్నట్లుగా ఉంది. కోదండపాణి రికమండేషన్‌మీద ఎంత బాగా చూసినా అక్కడికీ, ఇక్కడికీ తేడా తేడాయే.

తన మంచం, తన పక్క, తన కిష్టమైన కిటికీ... మెల్లగా నడిచింది భర్త చేతుల్ని పక్కకు జరిపి కిటికీ దగ్గరకు. ఆప్యాయంగా తలుపుల్ని సువ్వల్ని నిమిరింది.

ధారాళమయిన గాలి శరీరాన్ని ప్రేమగా పలుకరించింది. ఎన్ని పగళ్ళు, ఎన్ని రాత్రులు తను ఈ కిటికి దగ్గర గడిపింది. ఎన్నిసార్లు తన ఆవేదనను దిగమ్రింగుకుంది. ఎన్నిసార్లు ఎవరూ లేని ఒంటరి అయిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది.

వెక్కిళ్లు వినిపిస్తే వెనక్కు తిరిగింది కంగారుగా. గోడవైపు తిరిగి కండువాలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు పరమేశం. తడబడుతున్న అడుగులతో క్షణంలో భర్తను చేరింది భారతీదేవి.

"ఏమండీ... ఏమండీ... ఏమిటిది? ఊరుకోండి. పిల్లలు... పిల్లలు వస్తారు ఊరుకోండి" వీపు నిమురుతూ అనునయంగా మెల్లగా అంది.

ఆ చేతిని తన చేతిలోకి తీసుకుని ప్రేమగా నిమురుతూ "భారతీ" అంటూ భార్యను అక్కున చేర్చుకుని బావురు మన్నాడు పరమేశం. భారతీదేవి కళ్ళు నిండుకున్నాయి కన్నీళ్ళతో.

"భారతీ! నువ్వు... నువ్వు..." మాటలు పెగల్లేదు పరమేశానికి. ఎండిపోయిన పెదవులమీద వాడిపోయిన చిరునవ్వుని చూసి తల్లడిల్లిపోయాడు.

"ఎంతో కాలం ఉండను..."

"అలా... అలా మాట్లాడకు - నేను తట్టుకోలేను." చిన్నపిల్లాడే అయిపోయాడు పరమేశం.

భర్తను సముదాయించాలని... నాలుగు మాటలు మాట్లాడి అంతో ఇంతో ఓదార్పు నివ్వాలని అనిపించినా ఏమాత్రం ఓపిక లేకపోయింది. కళ్ళు తిరిగినట్లయింది.

"కాసేపు పడుకుంటాను." మెల్లగా అంది.

అతి జాగ్రత్తగా మంచందాకా నడిపించి పదిలంగా పడుకోబెట్టాడు భార్యను. స్విచ్ వేశాడు. ఫాన్ తిరగలేదు. టేబుల్ మీదున్న పేపర్ అందుకుని విసరసాగాడు. భారతీదేవి కళ్ళు మూతలు పడ్డాయి అలసటగా.


** ** **

వారం రోజు లయింది భారతీదేవి వచ్చి. ఆ రోజు ఉదయమే ముకుందరావు వెళ్ళిపోయాడు, శారదను మరో వారం తరువాత రమ్మనమని. భర్త లేని సువర్చల పిల్లలతో అక్కడే ఉంది. కొడుకులు పది రోజులు సెలవు పెట్టారని తెలిసింది. అంతా తన చుట్టూ మూగి ఏవో మాటలు చెబుతూ ఎంత ఆనందంగా ఉంచుతున్నారు? "అమ్మా! అమ్మా! అత్తయ్యా! అత్తయ్యా!" ఎప్పుడూ ఎవరో ఒకరు పిలవటమే... ఏదో మాట్లాడటమే... ఎంత సంతోషం... ఎంత తృప్తి... ఓహ్..!

కానీ, ఇప్పుడా... ఈ... ఈ చివరి ఘడియల్లోనా? ఇదివరకు కొంతలో కొంతయినా ఈ ఆనందం కలిగితే... తన ఆత్మ కొంతయినా తృప్తిపడేది. ఇప్పుడు ఒక్కసారిగా ఇలా ఉంటే తన హృదయం తట్టుకోలేకపోతుంది. ఎక్కువసేపు నిలువలేని ఆనందం అవుతుంది. ఆనందం, తృప్తి పడదామన్నా తనకు తెలియకుండానే ఆవిరి అయిపోతుంది. కళ్ళనిండా నీళ్ళు నిలిచి కణతలమీదుగా జారాయి.

మెల్లగా లేచి కిటికీ దగ్గరకు వచ్చింది.

దూరంగా కొబ్బరిచెట్టు దగ్గర పరమేశం, కోదండపాణి మాట్లాడుతూ కనిపించారు.



"ఏముంటుంది అంత రహస్యంగా మాట్లాడుకునేది - తన గురించే... తను ఎన్నాళ్ళు బ్రతుకుతుందని...? మూడు నెలలో ఆరు నెలలో... లేకుంటే. కొన్ని రోజులో... ముదిరిపోయిన కాన్సర్ తన బ్రతుకును తుడిచేస్తుంది. తన జీవితాన్ని మాయం చేస్తుంది. ఇప్పుడైనా కోదండపాణిగారి బలవంతం గాని తనపై శ్రద్ధ ఎవరికి ఉందని...? కళ్ళల్లో నీటి పొరలు కమ్మాయి. అంతా మనకగా కనిపించింది. ఓపికలేక వచ్చి మంచంమీద పడుకుంది.

భారతీదేవి కళ్ళముందు అప్పటి రోజులు కదులుతున్నాయి. అప్పటి ఆలోచనలు మెదులుతున్నాయి. మగతగా, మత్తుగా అనిపిస్తుంటే వాటిని బలవంతంగా నెట్టివేస్తూ ఆనాటి వేదనను గుర్తు తెచ్చుకోసాగింది.

** ** **

అత్త, మామ, ముగ్గురు ఆడపడుచులు, ఇద్దరు మరుదులు ఉన్న కుటుంబంలోకి అడుగు పెట్టింది పెళ్ళి పేరుతో భారతీదేవి. పరమేశం జడ్.పి. స్కూల్లో తెలుగు మాస్టారు. మూడు గదులున్న ఆ ఇంట్లో మనలటం మహా కష్టంగా అనిపించేది. తమ ఇంట్లో తను, అక్క ఇద్దరే. ఉన్న దాంట్లోనే కాస్త ఘరానాగానే బ్రతికారు. కుటుంబం కాస్త పెద్దదే అయినా, అబ్బాయి యోగ్యుడు అని, నలుగురి మధ్యా ఉంటావ్ అని తండ్రి నొప్పించకుండా ఒప్పించాడు. అక్క, అమ్మ వంతపాడారు. నెమ్మది తత్వం నీది. సర్దుకుపోగలవని... అన్నింటికీ సరే అంది. పెళ్ళయిపోయింది.

కట్నం భారీగానే ఇచ్చినా లాంఛనాలు అంటూ లాగాల్సినంతవరకు లాగారు. పండుగల పేరుతో మరి కొన్ని లాంఛనాలు. బట్టలు, వస్తువులు - ఇలా ఏవేవో ముడుతూనే ఉన్నాయి. తనలో మాత్రం వెలితి... ఎందుకు ఉండదు వెలితి? భర్తతో ఏకాంతంగా మాట్లాడే వీలుందా? భర్తతో కలిసి ఎటైనా వెళ్ళేది ఉందా? బయటకు అనుకుంటే అసహ్యంగా ఉంటుంది గాని, తమ ఒంటరితనంకోసం అందరూ నిద్రపోయేదాకా చూడవద్దూ... వంట గది తమ పడకగది. తండ్రి ఇచ్చిన ఫాన్ కాస్తా అత్తగారి ఆరోగ్యం బాగాలేదనే పేరుతో ఆవిడ దగ్గర ఉండిపోయింది. ఎప్పుడో ఒకసారి వంటగది కిటికీ నుండి కాస్తంత గాలి.

అలా కొద్దిసేపు అనుకోగానే ఎలాగో అనిపించేది. వెంటనే తన ఆలోచన తప్పు అనుకొని; ఉన్నదానిలో ఆనందం వెతుక్కోవా లనుకునేది.

"ఏమండీ..."

ఊఁ...

"ఈ రోజు సెలవు పెడతారా?"

"ఎందుకు?"

"అత్తయ్య, మామయ్య పెళ్ళికి వెళ్తున్నారు. మీ చెల్లెళ్ళు సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. మీ తమ్ముళ్ళు సాయంత్రం గాని రారు. మనం... మనం... అదే... సరదాగా మాట్లాడుకోవచ్చు..."

ఎర్రటి కళ్ళతో చూశాడు భార్యవైపు... వణికిపోయింది భారతి.

"మీకు వీలైతేనే!"

"వీలవదు." మొండిగా చెప్పి వెళ్ళిపోయాడు.

మూడేళ్ళలోనే తల్లి, తండ్రి చనిపోయారు. కుమిలిపోయింది. క్రుంగిపోయింది. పొలం అమ్మి ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేశారు అత్త మామ. కొంత ప్రశాంతంగా అనిపించింది. పెద్ద మరిది ప్రేమించానని ఎవరో కులం గాని అమ్మాయిని తీసుకువచ్చి ఇంట్లో గొడవపడి శాశ్వతంగా ఇల్లు దాటి వెళ్ళిపోయాడు.

ఏ సరదా సంతోషం లేకుండానే నలుగురు పిల్లల తల్లి అయింది భారతీదేవి మామగారు పక్షవాతం వచ్చి చనిపోయాడు. దిగులుగా అయిపోయాడు పరమేశం. అలా ఉన్న భర్తను ఎంతగానో ఓదార్చా లనిపించేది. దగ్గరగా కూర్చోవా లనిపించేది. ఎప్పుడో గాని అలా అవకాశం దొరికేది. ఆ రోజు నిజంగా పండుగే...

"ఈ రోజు శలవు పెడతారా?"

"శలవా? వీలుగాదు... రేపు దాన్ని చూడటానికి పెళ్ళివా రొస్తున్నారు. ఈ రోజూ, రేపూ అంటే కష్టం... శలవ్, శలవ్ అంటావు. ఇప్పుడు మనకేం తక్కువైందని..."

"అహఁ అది కాదు." అత్తగారు రావటంతో తడబాటు.

ఏంటిరా అని ఆవిడ అడగటం, ఈయన చెప్పటం... ఆవిడ గొణగటం... మామూలే... ఇల్లు అమ్మి చెల్లెలు పెళ్ళి అయిం దనిపించాడు పరమేశం... తమ్ముడ్ని బాగా చదివించాలని తన ఫ్రెండ్‌కు లెటర్ రాసి పంపించి నెలకు మూడొందలు పంపిస్తున్నాడు. ఆ తమ్ముడు చదివేది బి.ఎ. మొదటి సంవత్సరం.

అన్ని సమస్యలు తీరాయి అనుకొని, మొక్కుకున్న వ్రతం మిగిలి ఉంటే దాన్ని ఆ రోజు తీర్చుకోవా లనుకుంది.

"ఏమండీ!"

"ఏంటీ, శలవు పెట్టాలా?"

'ఎంత హేళన మాటల్లో... ఛీ! ఛీ!' మనసు బాధపడినా చెప్పింది.

"వీలుగాదు... వ్రతాలు... నోములకు శలవు ఏమిటి నాన్సెన్స్... శలవు పెట్టటానికి అర్థం ఉండాలి. నా షర్టుకు గుండీ కుట్టావా? మంచి కోడలు, మంచి వదిన అనిపించుకున్నావ్. మంచి భార్య అని కూడా అనిపించుకో."

'అ దో జోక్... అసహ్యం భారతికి ఇలాంటి మాటలు.' స్కూల్లో అంత ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళొచ్చు. ఫ్రెండ్ భార్య అన్నయ్యా అని ప్రేమ కురిపిస్తుందని, మారేజ్ డే మిమ్మల్నే పిలిచాను అని ఆప్యాయంగా అడిగిందని శలవు పెట్టి వెళ్ళి కొన్ని గంటలు గడిపి అలాగే వారితో మ్యాట్నీకి వెళ్ళి వచ్చాడు.

మనసు ఆపుకోలేక అడిగింది.

"మీతో పాటు నన్నూ పిలవచ్చు గదా వాళ్ళు" అని.

"అన్నారు... నీకు వీలుగాదని నేనే చెప్పాను."

మండిపోయింది భారతీదేవి మనసు భర్త సమాధానం విని.

'అంటే... తను ఎప్పుడూ ఇక్కడే ఈ ఇంట్లోనే మగ్గిపోవాలా? భర్తతో, పిల్లలతో ఏనాడైనా బయటకు వెళ్ళిందా? ఆడపడుచుల పెళ్ళిళ్ళు, పురుళ్ళతో వచ్చిపోయే బంధువులకు చేస్తున్న మర్యాదలతో ఎంతగానో అలసిపోయింది. ఏ ఒక్కనాడూ మనసుకు ఆనందం అనేది కించిత్తు కూడా కలుగలేదు. తన భర్త తనను ఎందుకు అర్థం చేసుకోడు? తనూ ఒక మనిషి అని, మనసు ఉంటుందని... చిన్న చిన్న కోరికలు, ఊహలు ఉంటాయని ఆలోచన రాదా? వేరే వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తాడు. అంతమాత్రం అయినా తను గాదా? వీళ్ళకేనా బిరుదులు... జీవిత భాగస్వామి అని, అర్థాంగి అని... సజావుగా నడవా లనుకుంటున్న సంసార రథంలో ఒక చక్రమని... ఇలా ఎన్ని... ఎన్ని... వాటికి విలువ మాటల వరకేనా? తనే కాదు ఎంతోమంది భార్యలు ఇలా మనసుపెట్టే బాధకు మెలికలు తిరిగిపోతూ క్రుంగిపోతున్నారు. తను చాలామందిని చూసింది, విన్నది. వారి భావన తప్పు అనుకునేది పెళ్ళి కాకముందు. తను అనుభవపూర్వకంగా తెలుసుకున్న తరువాత చాలా విషయాల్లో నిజం అనిపించింది.

భార్యలో కానరాని అందం బయట స్త్రీలో కనిపిస్తుంది.

పరాయి స్త్రీలో ఏ చిన్న గొప్పదనం కనిపించినా దానికి ఎన్నో పొగడ్తలు, ప్రోత్సాహం.

ఇంట్లో ఆడది మగ్గిపోతూ ఉండాలి. అసలు మన సనేదే ఉండగూడదు. ఆవిడకు ఏ విషయంలోనూ గుర్తింపు ఉండదు. అందరికీ పనికివచ్చే యంత్రం లాగా మాత్రం పని చేయాలి.

"ఏమండీ! బాబుకు జ్వరం కాస్త ఎక్కువయింది. ఈ రోజు శలవు పెట్టగూడదూ..."

"శలవా... వీలుకాదు... రేపు ఇన్‌స్పెక్షన్ ఉంది."

"రేపు గదా? ఈ రోజు నేను అడిగేది."

"ఉండి ఏం చేయను. వాడి జ్వరం తగ్గించగలనా? అమ్మను తీసుకెళ్ళు హాస్పిటల్‌కు. దీనికోసం అనవసరంగా శలవ వేస్ట్ ఎందుకు? మరీ అవసరం అయితే వాడుకోవాలి గాని, ప్రతి చిన్నదానికీ శలవ అంటే ఎలా?"

కండువా మడత సరిచేసుకుంటూ వెళ్ళబోతున్న అతన్ని పులి పంజాలాగా పట్టుకుని లాగి కసితీరా హింసించా లనిపించింది.

బాధను దిగమింగుకుంది. రెండు రోజుల్లో జ్వరం తగ్గిపోయింది.

"రేపు ఊరు వెళ్తున్నా..."

"దేనికి?" అడగాలని అనిపించకున్నా అడిగింది.

"మా ఫ్రెండ్ యూనస్ కొడుకు స్కాలర్‌షిప్ ఆగిపోయింది. నిన్న సాయంత్రం యూనస్ భర్త బజార్లో కలిసి చెప్పాడు. ఆ విషయంలో కాస్త పైరవీ చేయాలి. లీవ్ లెటర్ రాసి ఇస్తాను. రామారావుగా రింటికి పంపించు మాధవ్‌తో.

"భారతీ! సువర్చలను అంతగా

పట్టించుకోకపోయినా ఫర్వాలేదు గాని, మాధవ్, ఈశ్వర్ చదువులు జాగ్రత్త. తెల్లవారుజామున సరిగ్గా లేవటంలేదు నువ్వు. రేపటినుండి శ్రద్ధగా లేవు..." అవలిస్తూ అటు తిరిగి పడుకున్నాడు పరమేశం.

'ఇవి ఈ రోజు ఉదయం నుంచి ఇప్పటివరకూ మధ్య కాలంలో తమ మధ్య నడిచిన మాటలు.'

ఉదయం పేపర్ చూడటం, స్నానం, టిఫిన్ తిని స్కూలుకు వెళ్ళటం... మధ్యాహ్నం వచ్చి అన్నం తిని మళ్ళీ వెళ్ళటం... సాయంత్రంవేళ స్కూలు అయిపోగానే అందరి సమస్యలు తనవే అయినట్లు తెలుసుకుని చర్చించి ఎప్పటికో ఇంటికి రావటం... తినటం... అలసిపోయానని నిద్రపోవటం... రోజూ ఇంతే... ఏనాడూ మార్పు ఉండదు.

ఇంటి విషయాలు, పిల్లల విషయాలు అన్నీ తనే పట్టించుకోవాలి... అతనికి నచ్చనిది ఏది జరిగినా పూర్తిగా బాధ్యురాలు తనే. అలా సంవత్సరాలు గడిచిపోయాయి. పిల్లల పెళ్ళిళ్ళు అయిపోయాయి. అత్తగారు చనిపోయింది. చిన్న కొడుకు ఉద్యోగరీత్యా దూరంగా వెళ్ళిపోయినా పెద్ద కొడుకు ఈ ఊళ్ళోనే ఉద్యోగం గావటంతో ఇక్కడే ఉంటున్నాడు.

భర్తవలన లేని ఆనందం పిల్లలవలననైనా కలుగుతుం దనుకున్న ఆశ కాస్తా నిరాశగా అయిపోయింది.

వారం రోజుల నుండి జ్వరం వస్తోంది భారతీదేవికి. మెడికల్ షాప్‌లో జ్వరం కోసం టాబ్లెట్స్ అడిగి తెచ్చారే గాని, ఏ ఒక్కరూ హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలని అనుకోలేదు. చెప్పలేని నీరసం. మనసు దిగులు. చాలావరకు మనిషి క్రుంగిపోయింది.

దగ్గుతుంటే పాప లేస్తుందేమో అని విసుగ్గా చూసేది కోడలు.

"రమా! అమ్మకు పాలు ఎక్కువ ఇవ్వు రేపటినుండి." కొడుకు అథారిటీ.

"పొద్దస్తమానం ఇంట్లో ఉండేబదులు అలా గుడికి వెళ్ళరాదూ - కాస్త ప్రశాంతంగా ఉంటుంది. రమా! నీతోపాటు మీ అత్తగార్ని కూడా బజారుకు తీసుకెళ్ళు కూరలు కొనటానికి వెళ్లావుగా రోజూ."

ఎర్రటి కళ్ళతో కోడలు భర్తవైపు చూస్తుంటే అర్థం చేసుకుంది భారతీదేవి.

"భర్తతో వెళ్ళాలని పాపం ఆ అమ్మాయి ఆశపడటంలో తప్పేముంది? తీరిక లేదు అని కొడుకు అంటే అతనిమీద కసితో, కోపంతో తనంతట తనే కొన్ని కొన్ని పనులు చేసుకోవా లనుకుంది. చేస్తుంది స్వేచ్ఛగా. కానీ అందులో ఆనందం మాత్రం పొందటంలేదని ఏనాడో గమనించింది. ఎక్కువ భారాన్ని మీద వేసుకోవటంతో బజారు పనులన్నీ చేయటం తప్పనిసరి అయింది. కొడుకుకు మరి కాస్త సమయం దొరికి మరింత హాయిగా ఉంటున్నాడు. తండ్రి త్రోవలోనే తనయుడు నడుస్తున్నాడు. దాదాపుగా తండ్రి మనస్తత్వమే వీడిది కూడా.

"కాస్త తగ్గిందా జ్వరం..." చేయి పట్టుకుని చూస్తున్న భర్తవైపు చూసింది భారతీదేవి. తడి ముఖంమీద వేసుకున్న పౌడర్ గోడకు కొట్టిన సున్నం లాగా అంటీ అంటనట్లుగా కనిపించింది.

"శలవు పెడతారా!" అడగబోయి మానుకుంది.

"కాస్త శ్రద్ధగా వేసుకో మందులు. ఆ టానిక్ తాగుతున్నావా? నువ్వు అర్థం పర్థావనుకో... అంత ఫినిష్. మేమంత హాహాకారాలు చేయాలి. ఆఁ... నీ కో విషయం చెప్పా లనుకుని మర్చిపోయాను. మీ ఇంట్లో అద్దెకుండి చదివాడట కోదండపాణి అని. అతను ఇప్పుడు డాక్టర్‌గా వచ్చాడు గవర్నమెంట్ హాస్పిటల్‌కు. నిన్న చిన్న పని ఉండి వెళ్ళానులే సంతకం కోసం. మన పెళ్ళికి వచ్చాడట. నన్ను బాగానే గుర్తుపట్టాడు. మ నింటి కోసారి రమ్మన్నాను. - అలాంటివాళ్ళు మనకు దగ్గరగా ఉంటే చాలా అవసరాలు తీరుతాయి."

వినలేకపోయింది భారతీదేవి.

అన్నట్లుగా వచ్చాడు కోదండపాణి. వెనుకటి విషయాలు చాలా గుర్తు చేశాడు. రేపు హాస్పిటల్‌కు రమ్మనమని చనువుగా కోప్పడ్డాడు. అలా అతను రావటం అలవాటుగా అయింది.

హైదరాబాద్ భార్యతో వెళ్తున్నానని భారతీదేవిని అక్కడ తనకు తెలిసిన డాక్టర్ ద్వారా చెక్ చేయిద్దామని సలహా ఇచ్చాడు పరమేశానికి.

వెళ్ళేది అతని కారులోనే కనుక వెంటనే సరే అన్నాడు. భారతీదేవి రానంది. కోదండపాణి నచ్చచెప్పాడు. కొడుకు, కోడలు కూడా వెళ్లమన్నారు. తప్పనిసరి అయి వెళ్ళింది.

ఏదో మామూలు చెకప్ అనుకున్న వారికి పిడుగుపాటు వార్త తెలిసింది - భారతీదేవికి కాన్సర్ అని, బాగా ముదిరిపోయిందని.

కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుడు... అందరి పిల్లలూ అబగా వచ్చేశారు ఏడ్చారు. భారతీదేవికి కంటికి చుక్కకూడా రాలేదు. నిర్లిప్తంగా అయింది ఆవిడ మనసు.

"ఎప్పటికైనా పోవాల్సిందాన్నే కదా! అయినా నాకేం లోటు ఉందని. హాయిగా వెళ్ళిపోతాను. మీరు బాధపడకండి" అంటూ అందర్నీ ఓదార్చింది.

రెండు రోజు లుండి అంతా వెళ్ళిపోయారు. కొన్ని నెలల ట్రీట్‌మెంట్‌కోసం కోదండపాణి సలహామీద అక్కడే ఉంచాడు పరమేశం భార్యను.

"పరమేశంగారూ! భారతీదేవి బ్రతుకుతుందన్న ఆశతో కాదు ఇక్కడ ఉంచుతున్నది. కొంతకాలం అయినా ఆవిడ జీవితాన్ని పొడిగించుదామని. భారతి చివరి రోజుల్లో ఉంది. ఆవిడకు ప్రశాంతత, తృప్తి కలిగించండి. సంతోషంగా ఉంచండి. ఆవిడ కోరికలు ఏవైనా ఉంటే తీర్చండి."

డాక్టర్ చెబుతున్నది విని క్రుంగి కూలబడిపోయాడు పరమేశం.

చాలాసేపు పరమేశాన్ని ఓదార్చాడు కోదండపాణి. కోదండపాణి అత్తగా రింట్లోనే పరమేశం ఉండటం. ఆ ఇంటి వారంతా ఎంతో ఆప్యాయత చూపించారు. భారతీదేవి, పరమేశాన్ని తమ సొంత వ్యక్తుల్లా భావించారు. ఇంటికి, హాస్పిటల్‌కు తిరుగుతూ రోజులు గడపసాగారు వాళ్ళు. మదన్, ఈశ్వర్ మధ్యలో రెండుసార్లు వచ్చి వెళ్ళారు.

రెండు నెలలు గడిచాయి. మధ్య మధ్య కోదండపాణి వచ్చి వెళ్తున్నాడు. భారతీదేవి మాట్లాడటం అసలే అంతంతమాత్రం. ఇప్పుడు మరీ మౌనంగా అయింది. పరమేశంలో మార్పు వచ్చింది. స్కూలుకు శలవు పెట్టేశాడు. ఎక్కువ సమయం భార్య దగ్గర గడుపుతున్నాడు. ఏవో ఏవో ప్రశ్నలు వేసి ఏ సమాధానం రాక కన్నీళ్ళు కూడా పెట్టుకుంటున్నాడు.

భారతీదేవి మనసు ఏదో ఒక క్షణంలో భర్తను అలా చూసి చివుక్కుమన్నా హృదయం స్పందించటం ఎప్పుడో మానివేయటంతో నిర్లిప్తంగా చూడటం తప్ప ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయింది.

అడగలేక అడగలేక అడిగాడు పరమేశం ఆ రోజు.

"భారతీ!"

"ఊఁ..."

"నీకు... నీకు కోరికలు ఏమన్నా..." ఎలా అడగాలో తోచక ఆగిపోయాడు.

నవ్వింది భారతి అలసటగా.

"కోరికలా... నాకా... ఏమిటి ఇంత శ్రద్ధ... చివరి రోజులనా?" ఒక్కొక్క మాట ఒక్కొక్క తుపాకీ గుండులా అతని హృదయాన్ని తాకింది.

"అయినా మీరు ఇక్కడ ఎందు కుంటున్నారో నాకు అర్థం కావటంలేదు. మీకు ఎన్ని శలవులు వృథా అవుతున్నాయి. అవసరానికి వాడుకోవాలి గాని, అనవసరంగా ఎందుకు? నేను ఎలాగూ బ్రతకను. ఎప్పుడో కాదు... త్వరలోనే రాలిపోయే ఆకులా ఉన్నాను. నా కోసం ఎందుకు వృథాగా శలవులు ఖర్చు చేస్తారు. ఉంచుకోండి. ముందు ముందు ముఖ్యమైన వాటికి ఉపయోగపడతాయి."

"భారతీ! అలా మాట్లాడకు..." దోసిట్లో ముఖం దాచుకున్నాడు పరమేశం. కదిలి కదిలి

## రెండు తలల పాము

సృష్టిలో ఉన్న వింతలలో రెండు తలల పాములు కూడా ఉన్నాయి. అతి అరుధుగా ఉండే ఈ జాతి పాములకి రెండు తలలూ వంగల కర్రలాగా వక్క వక్కనే ఉంటాయి. అయితే దక్షిణ అమెరికాలోని కీకారణ్యాలలో ఒక వింత జాతి సర్పం కనిపిస్తుంది. తోక కొసగా ఉండకుండా మొద్దుబారి తలను తలపింపజేస్తుంటుంది. విశేష మేమిటంటే ఈ పాము తోకతో కూడా అంటే రెండు వైపులనుంచీ కూడా కాటు వేస్తుందని అక్కడి ఆటవికులు చెప్తారు. అందుకనే దీన్ని రెండు తలల పాము అని అంటారు. అతి అరుదుగా కనిపించే ఈ పాముల గురించి సమగ్రమైన శాస్త్రీయ పరిశోధన ఇంకా జరగవలసి ఉంది.

- కె.ఆర్.కె. మోహన్

ఏడ్చాడు... కుమిలి కుమిలి ఏడ్చాడు.

"మీరు ఏడుస్తున్నారా? మీ హృదయం పాషాణం కదా... దానిలో చలనమా... ఏంటి విచిత్రం..."

"భారతీ!" ఆవిడమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఏ స్పందన లేకుండా జీవం లేనట్లుగా అలాగే పడుకుంది.

"నిజం చెబుతున్నాను. మీరు ఇక్కడ ఉండటం నా కేమాత్రం ఇష్టం లేదు. కానీ నలుగురికోసం చివరి రోజుల్లో కూడా మనసుకు ఇష్టం లేకపోయినా బలవంతంగా భరిస్తున్నాను. మిమ్మల్ని మరీ మరీ అడుగుతున్నాను - మీరు వెళ్ళిపోండి. అదే నా కోరిక..."

"భారతీ... అలా అనకు... అలా అనకు... నన్ను క్షమించు."


"నిన్ను చాలా బాధపెట్టాను."

"కాదు - చిత్రవధ చేశారు. ప్రతి క్షణం హింసించారు. ఏనాడూ మీవలన ఆనందం పొందలేకపోయాను. ఇక దీనికి భార్యా భర్తల సంబంధం ఏమిటి? ఆ బంధంలో అర్థం ఏమిటి? చూసేవారి దృష్టిలో మనం భార్యా భర్తలం... నా దృష్టిలో భర్తగా మీరు ఆ స్థానం పొందలేకపోయారు. పరిచయస్తులు, పరాయి వ్యక్తుల మాత్రంగా నైనా మీరు ఉండలేకపోయారు. నన్ను ఒక వస్తువుగా భావించారే తప్ప మనిషిగా ఏనాడూ చూడలేదు."

"కాదు భారతీ! అలా కాదు."

"మిమ్మల్ని మీరు సమర్థించుకోకండి. మీ ఇంటికి వచ్చాను. బాధ్యతలు నెరవేర్చాను. పిల్లల్ని తీర్చిదిద్దాను. సంసారానికి ముఖ్యంగా మీకు నేను చేయాల్సిందంత చేశాను. మీరు ఏ అనుభూతులూ లేని జీవితంలో నన్ను ఉంచారు. మనసులో ఆనందం, వేదన చెప్పుకోగలిగేది ఒక్క భర్తకే. కంచే చేను మేసే సామెతగా ఏ ఆనందం ఇవ్వకపోగా ప్రతి క్షణం మనసు వేదనకు గురిచేస్తే నేను ఎవరికి చెప్పుకోవాలి? ఏ సరదా లేదు. ఏ సంతోషమూ లేదు. నిస్సారంగా గడిపాను జీవితమంత. నాకంటే, పిల్లలకంటే మీకు బయటవారు ముఖ్య మయ్యారు. బయటవారి పొగడ్తలు మీకు కావాలి. మనుషుల మధ్య పలుకుబడి, హెూదా మీకు కావాలి. పదిమందీ మిమ్మల్ని గుర్తించాలనే తాపత్రయం ఉన్న వ్యక్తి మీరు. అందుకే ఇంట్లో వ్యక్తులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. పిల్లల్ని తండ్రిగా మీరు పట్టించుకోకపోయినా నేను పట్టించుకున్నాను. మరి నా గురించి... నా గురించి నా మంచి చెడ్డలు ఆలోచించాల్సిన వ్యక్తి ఎవరు... మీరు! అదే నాకు పూర్తిగా కరువైపోయింది. మోయలేని భారాన్ని మోస్తూ ఈడ్చుకుంటూ వచ్చాను సంసారాన్ని.

"నాకు చేయి విరిగితే జాగ్రత్తగా ఉండొచ్చు గదా - అయిదు వారాలు ఈ కట్టుతో తిరుగుతుంటావేమో. అది అతుకుతుందో, లేదో... లేనిపోని చికాకయింది అని విసుక్కున్నారు. నీరసంతో కళ్ళు తిరిగి పడిపోయిందని... జ్వరం




వస్తుందని తెలుసుకుని కూడా సానుభూతి చూపించలేకపోయారు. ఎక్స్‌రే కోసం ఎంతగా విసుక్కున్నారు... అనవసరపు ఖర్చు అని. మిమ్మల్ని రమ్మంటే అంతెత్తున ఎగిరారు ఇంట్లో ఉన్నవారు చాలరా అని... పిల్లలకు బాగాలేకుంటే నాకు భయంవేసి శలవు పెట్టమంటే విసుక్కున్నారు. ఈ రోజు శలవు పెట్టండి సరదాగా ఎక్కడైనా వెళ్దాం అంటే హేళన చేశారు. ఎవరూ ఇంట్లో ఉండటంలేదు శలవు పెట్టండి సరదాగా ఉందాం అంటే వ్యంగ్యంగా మాట్లాడారు. జ్వరంతో మగ్గిపోతున్నా నన్ను వదిలి ఊళ్ళో వాళ్ళ పైరవీలు... ఇలా ఎన్ని... ఎన్నని? అన్నీ మీకు తెలును... ఎన్నో చెప్పలేను... ఓపిక లేదు. అన్ని బాధ్యతలూ తీరాయి అనుకుని ఇకనుండి అయినా ఆనందంగా గడుపుదామని మనసు ఆరాటపడుతుంటే మీకు తెలిపితే ఇంకా మనం చిన్నపిల్లలమా అన్నారా? సరదా, సంతోషాలకు కూడా వయసు పరిమితి ఉంటుందా?

"నా మనసు పూర్తిగా నలిగిపోయింది. ఇప్పుడు నాకు కోరికలా... నాకున్న కోరికల్లా ఒక్కటే..."

పరమేశం నీరసించిన కళ్ళలో కొన్త వెలుగు వచ్చింది.

"మీ పిల్లలూ మీ త్రోవలోనే నడుస్తున్నారు. చిన్నవాడు కొంత నయం అనుకున్నా గాని కాదు... రమణి, శారద మరో భారతిలా కాకుండా చూడండి. ఇప్పుడు నా ఘోష వింటున్నారు. ఇదే వారికి కలుగనీయద్దని వారితో చెప్పండి. మీ మార్గం తప్పని వారికి తెలియజేయండి. చివరి ఘడియల్లో మనసు తెలుసుకుంటే మిగిలేది ఆవేదన అని చెప్పండి. ప్రతి క్షణం, ప్రతి నిముషం, ప్రతి రోజూ, ప్రతి నెల, ప్రతి సంవత్సరం - ఇలా ఒకరి మనసు ఒకరు తెలుసుకుని గడుపుతుంటే రోజులు ఎంతో హాయిగా, ఆనందంగా గడిచిపోతాయి. తృప్తి మిగులుతుంది. లేకుంటే ప్రతి రోజూ భారంగా వెళ్ళదీయాలి. నడుస్తున్న కాలంతో ఇష్టంలేని ప్రయాణం చేయాలి. ఇదిగో నాలాగా... వాళ్ళు చిన్నపిల్లలు. అనుభవించాల్సిన వయసు, కాలం ఎంతో ఉంది. మీ కొడుకుల్ని మార్చండి. అదే నా కోరిక. సువర్చలకు భర్త లేడు. కొడుకును పట్టించుకుని ప్రయోజకుడ్ని చేయండి. మీరు ప్రశాంతంగా ఉండండి అనలేను. మీరు ఉండలేరు. నాకు తెలును. కానీ కాలం తిరిగిరానిది. ఏదో తప్పు చేశామని తీర్చిదిద్దుకుంటామని ఎవరికో చెప్పి మళ్ళీ చిన్నవాళ్ళం కాలేము గదా? గడిచినదాన్ని అలాగే ఉంచక తప్పదు. మీకు ఇప్పుడు అనిపించవచ్చు... ఆనందంగా గడపాలని, తృప్తిగా ఉంచాలని. చనిపోయే ముందా? ఇపుడా ఈ ఆలోచన... మనిషి చనిపోతాడని తెలిస్తేనేనా ప్రేమ, ఇష్టం! మనిషి చనిపోయినా మాట చనిపోదు. నా మాటలు మర్చిపోకండి. మీ రన్నమాట గుర్తొస్తోంది - ఎందుకురా అన్ని శలవులు పెట్టారు. అవసరానికి వాడుకోవటం నేర్చుకోండని. ఇప్పుడూ మనం వెళ్ళేసరికి శలవలు పెట్టుకుని ఉంటారేమో. మరి ఉండమని చెప్తారా? మళ్ళీ అమ్మకోసం అవసరం అవుతుంది పది రోజులు. అప్పుడు పెట్టవచ్చు అని వెళ్ళగొడతారా? మరి ఇక మీతో... శలవా... శలవ్... మళ్ళీ చెప్పగలనో, లేదో?"

"భారతీ... భారతీ..." పరమేశం హృదయం తూట్లు పడిపోయింది. భార్య లోగొంతుకలో పదునైన కత్తిలాంటి మాటలు వాడి మళ్ళీ కోలుకోలేనట్లుగా చేస్తుందని ఊహించలేదు. ఆమెను సరదా సంతోషాలతో ఉంచా లనుకున్నాడు. ఉన్న కోరికలు తీర్చుదా మనుకున్నాడు. కానీ... కానీ... అన్నింటికీ ఆలస్యం అయిపోయింది. ఇప్పుడు ఏమనుకున్నా ప్రయోజనం లేకుండా అయింది. భారతికి ఇష్టం లేకున్నా తన తృప్తికోసం ఇలా గడపాలి... అంతే...

"భారతీ... నీ మనసులో నేను లేకున్నా ఇలా ఉండటం నీ కిష్టం లేకున్నా ఇన్నాళ్ళు అనుకున్నట్లుగా చలనంలేని విగ్రహం అనుకుని నన్ను ఉండనీయి. నా తృప్తికోసం, నా ఆనందంకోసం."

"చివరి రోజుల్లో కూడా గెలుపు మీదేనా?"

కండువాలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు పరమేశం.

** ** **

చల్లటి గాలి ముఖానికి తాకింది. ఉలిక్కిపడింది భారతీదేవి. కరెంటు ఎప్పుడు పోయిందో... మళ్ళీ వచ్చినట్లుంది.

"భారతీ... కొన్త చల్లటిగాలిలో కూర్చుంటావా?" భర్త గొంతు విని అతనివైపు చూసింది. కళ్ళు చాలా లోతుకు పోయి గడ్డం పెరిగి ఉంది.

"శలవు వేస్ట్ అవుతుందంటే అర్థం చేసుకోవేం!" పెద్ద కొడుకు భార్య మీద ఎగిరి పడుతున్నాడు. అలవోకగా నవ్వింది భారతీదేవి. పరమేశం ముఖం సిగ్గుతో వాలిపోయింది. ★